మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# రోడ్డు ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు

**● రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: నారాయణపేట జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు**

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఉదయం జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, మక్తల్ సిఐ సీతయ్య, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, కాంట్రాకర్లు కలిసి మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎలిగండ్ల చౌరస్తా నుండి కృష్ణ బోర్డర్ చెక్‌పోస్టు వరకు నేషనల్ హైవే 167 పై 30 కి.మీ. వరకు రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రోన్ ఏరియాస్‌ను గుర్తించడం జరిగింది. రోడ్డు ప్రమాదంలో జరిగే ప్రాంతాలు మక్తల్‌లో 5,మాగనూరులో 3, కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో 3 గుర్తించడం జరిగింది. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రోన్ ఏరియాలలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అక్కడ అవసరమైన బారికేడ్స్, రేడియం స్టిక్కర్స్, సైన్‌బోర్డ్సు, బొల్లర్డ్స్‌ను ఏర్పాటు చేయాలని హైవే అధికారులకు సూచించారు. అదేవిధంగా గ్రామాల నుండి ప్రధాన రహదారి కలిసే రోడ్డు మార్గాలకి స్పీడ్ బ్రేకర్లతో పాటు వైట్ పెయింట్ వేసి వాహనదారులు గుర్తించే విధంగా చేయాలని కోరారు. గ్రామాలను ఆనుకుని ఉన్న ప్రధాన రహదారిపై వాహనాలు వేగంగా వెళ్లకుండా మూడు చోట్ల డ్రమ్ములను ఏర్పాటు చేసి వాటికి రేడియం స్టిక్కర్‌లు వేసి వాహనాలు మెల్లగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న గ్రామాలలో ఎక్కడైతే స్పీడ్ బ్రేకర్లు వైట్ పెయింట్ వేయలేదు వెంటనే వేసి అక్కడ రేడియం స్టిక్కర్లు, బ్లింకింగ్ లైట్స్ వేయించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పోలీస్ అధికారులు పోలీస్ స్టేషన్ పరిధిలోని రోడ్డు నిబంధనలు పాటించేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారనే ధ్యేయంగా పని చేయాలని తెలిపారు. ఎస్పీతో పాటు సిఐ సీతయ్య, ఎస్సై పర్వతాలు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు శ్రీకాంత్, మధు,మధుసూదన్‌రావు,వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టు వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ

**కృష్ణ బోర్డర్ చెక్‌పోస్టు తనిఖీ చేసిన ఎస్పీ:** కర్ణాటక రాష్ట్రంలో వచ్చేనెల 10వ తేదీన జరిగే సాధారణ ఎన్నికల సందర్భంగా బార్డర్ చెక్‌పోస్టు పోలీసు, సంబంధిత అధికారులు అప్రమత్తంగా చూడాలని బార్డర్‌లో వచ్చిపోయే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, వాహనాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ నంబర్లను నమోదు చేయాలని, తెలిపారు. ఎన్నికల సందర్భంగా అక్రమంగా డబ్బు, మద్యం, విలువైన వస్తువులు రవాణా జరగకుండా చూడాలని చెక్‌పోస్టు దగ్గర 24 గంటలు అప్రమత్తంగా ఉంటూ వాహనాలను తనిఖీ నిర్వహించాలని తెలిపారు. అలాగే కర్ణాటక రాష్ట్రం నుండి వరిధాన్యం తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లాలోకి రాకుండా చూడాలని తెలిపారు. చెక్‌పోస్టు దగ్గర సిఐ సీతయ్య, ఎస్సై విజయ భాస్కర్, నరెందర్, సురేష్,పోలీస్ సిబ్బంది, ఎక్సైజ్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

**మక్తల్ సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ:** జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం మధ్యాహ్నం సర్కిల్ ఆఫీస్‌ను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను అడిగి తెలుసుకుని పెండింగ్‌లో లేకుండా న్యాయాధికారులతో సమన్వయం చేసుకుంటూ వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు కనీస మర్యాద కల్పించి వారి ఫిర్యాదుల పట్ల తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు న్యాయమందే విధంగా చూడాలని తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలీస్ స్టేషన్ పరిధిలోని విలేజ్ ఆఫీసర్స్ గ్రామాలలో పర్యటిస్తూ ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సామాజికాంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పోలీస్‌అధికారులు కూడా సెన్సిటివ్ గ్రామాలపై దృష్టి సారించి గ్రామాలను సందర్శించి ప్రజల సమస్యలు తెలుసుకోవాలనిపై అధికారులకు తెలపాలని కోరారు. మక్తల్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న పాత క్వార్టర్స్‌ని నివాస యోగ్యం లేనివి మొత్తం వెంటనే శుభ్రం చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలకు గురైన విడిచిపెట్టబడిన, పట్టుబడిన వాహనాలను పోలీస్ స్టేషన్‌లో ఉంచకుండా వాటిని వేలం వేయాలని అధికారులకు సూచించారు. మక్తల్ పోలీస్ స్టేషన్ పరిసరాలనుపరిశుభ్రంగా ఉంచి పళ్ల మొక్కలు, పూల మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ఎస్పీతో పాటు సీఐ సీతయ్య, ఎస్సై పర్వతాలు ఉన్నారు.

## రూ.2లక్షల ఎల్‌ఓసీ అందజేసిన మంత్రి



**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్29 ప్రభాత వార్త:** ఖిల్లాఘణపురం మండలం కమలొద్దీన్‌పూర్, అంతాయపల్లి గ్రామానికి చెందిన రామ్ రెడ్డి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 2లక్షల ఎల్ఓసీని హైదరాబాద్ మంత్రుల నివాస సముదాయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి లబ్దిదారులకు అందజేశారు. అనంతరం ప్రమాదంలో గాయపడి అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోపాల్‌పేట మండలం చాకల్‌పల్లి గ్రామానికి చెందిన వజ్రారెడ్డిని మంత్రి పరామర్శించారు.

## జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెబాట



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** అసెంబ్లీ సాక్షిగా సీఎం కెసిఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలంటూ ప్రభుత్వంపై జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కదం తొక్కేందుకు సిద్ధమవుతున్నారు. ప్రొహిబిషన్ పీరియడ్ ముగిసినందున జిఓ 26ను అమలు చేస్తూ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కళ్లకు గంతలు కట్టుకుని గద్వాల జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె విషయమై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు సమ్మె నోటీసు సైతం అందజేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేపడుతున్నారు.

## మొలకెత్తిన వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలి



తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** కృష్ణ మండలంలోని గుడెబ ల్లూరు,టైరోడ్డు, మురారి దొడ్డి గ్రామాలలో వర్షాల కారణంగా మొలకెత్తిన ధాన్యాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ప్రశాంత్‌రెడ్డి స్థానిక రైతులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాటాడి వరిధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు కన్నీళ్లు పెడుతు న్నారు. ధాన్యాన్ని దాచుకోవడానికి బ్యాగ్స్ లేక చాలా బాధపడుతున్నారన్నారు. కష్టా లు తెలుసని పదే పదే మాట్లాడే నియోజకవర్గ నాయకులు రైతుల వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి మొలకెత్తిన వరి ధాన్యాన్ని ప్రతి గింజలు కొనుగోలు చేయాలని గన్ని బ్యాగుల కొరత లేకుండా చూడాలని లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని అన్నారు. రైతులు ఎవరు అధైర్యపడవద్దని రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా మోగడం ఖాయమని రైతుల పక్షపాతి కాంగ్రెస్ అని ఆ వైపునకు ఆలోచించాలని వారన్నారు. రైతులను పరామర్శించిన వారిలో ఎంపిటిసి నారాయణ, సంతోష్, సంతోష్‌శెట్టి, నాగేశ్వర్‌రావు,ప్రతాప్, మాజీసర్పంచ్ ఐనాపూర్ ప్రభాకర్‌రెడ్డి, ఊట్కూర్ కొక్కు శంకర్, అనిల్ మారెప్ప,దేవప్ప, సిద్దరాములు,రోహిత్, తిప్పన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలి : ఎమ్మెల్యే

**అమరచింత,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండాలని, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అమరచింత మున్సిపాలిటీ 4,5వ వార్డుల పరిధిలోని మహిళలు ఆపరేషన్ మెర్సీ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జిల్లా ఎస్సీ కార్పోరేషన్ నుంచి మంజూరైన టైలరింగ్ మిషన్లు 46మంది మహిళలకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కంప్యూటర్ యుగంలో మహిళలు రాజకీయ, ఉద్యోగ, సామాజిక రంగాల్లో స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమని అన్నారు. ఎస్సీ కార్పోరేషన్ ద్వారా ఇక్కడ 40మంది మహిళలు కుట్టు శిక్షణ పూరినత చేసుకోవడం జరిగిందని, వారు స్వయం ఉపాధిలో రాణించాలని ఆయన కోరారు. తమ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కట్టుబడి ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ నాగభూషణం గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మెన్ ఎస్ఎ రాజు,మాజీ జడ్పీటీసీ రాజేందర్ సింగ్, కౌన్సిలర్ రాజ్ కుమార్, సింధు, బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, రవి కుమార్ యాదవ్, టౌన్ ప్రెసిడెంట్ నర్సింహులు గౌడ్, కో ఆప్షన్ సభ్యులు ఏపీ రాజేందర్, షానవజ్, రఫీ, రియాజ్, చిన్న బాలరాజు, కమలాకర్ గౌడ్, మహిపాల్, శివ, శంకర్ నాయక్, యాదగిరి, తో పాటు ఎస్సీ కార్పోరేషన్ జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

## భవన నిర్మాణ రంగ కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలు

**● నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్**



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** మే 1న అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 1న కార్మిక దినోత్సవాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో కార్మిక ఆత్మీయ సంబురాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కామన్ సర్వీస్ సెంటర్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో జిల్లాలో రిజిస్టర్ చేసుకున్న నిర్మాణ రంగ కార్మికులకు 3 రోజుల పాటు 50 రకాల వైద్య పరీక్షలు, వైద్య చికిత్సలు అందించనున్నారు. మే 1న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలుర గ్రౌండ్స్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తారు. మే 2న తుడుకుర్తి గ్రామంలో,3న బిజనపల్లి మండలం శాయిన్‌పల్లి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ ద్వారా తన పేరు రిజిష్టర్ చేసుకొని లేబర్ కార్డు పొందియున్న వారు ఈ ఉచిత వైద్య పరీక్షలకు అర్హులని తెలిపారు. వైద్య పరీక్షకు వచ్చేటప్పుడు లేబర్ కార్డుతో పాటు ఆధార్ కార్డు వెంట తీసుకొని రావాలి. భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు కూలి పని, తాపి మేస్త్రీ, ప్లంబర్, టైల్స్, ఎలక్ట్రిషన్, వడ్రంగి తదితర కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఆధునిక ఆరోగ్య పరీక్షలు, రక్తపోటు, రక్త చక్కెర పరీక్షలు, చెవి, కంటి పరీక్షలు, ఊపిరితిత్తులు, రక్త, మూత్ర పరీక్షలు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్

**వీపనగండ్ల,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ప్రజలు మొరపెట్టుకున్న జరగని పనులు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ధృఢసంకల్పంతో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే మండల కేంద్రానికి వచ్చి ఇల్లు లేని ప్రతి ఒక్కరికి దగ్గరుండి ఇల్లు ఇప్పిస్తానని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. వారం రోజుల్లో దళితబంధు అమలు చేస్తానని తెలిపారు. అనంతరం వరి కొనుగోలు కేంద్రాల దగ్గరకు వెళ్లి తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించి, రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యన్ని త్వరగా కొనుగోలు చేయాలని రైతులు ఎమ్మెల్యేను కోరగా, దానికి స్పందించిన ఆయన అధికారులతో ఫోన్లో మాట్లాడి రైతుల వడ్లను త్వరగా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. తూముకుంట గ్రామానికి వెళ్లిన ఆయన అక్కడ ఎన్నో సంవత్సరాల నుండి ప్రజలు మొరపెట్టుకున్న జరగని పనిని ఆయన ధృఢసంకల్పంతో వాగుపై బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. బ్రిడ్జి మ్యాపును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. త్వరలోనే తూముకుంట గ్రామానికి మంత్రి చేతుల మీదుగా రూ. 2కోట్ల పనులకు శంకుస్థాపన చేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. సంగినేనిపల్లి గ్రామంలో డ్రైనేజీ కాల్వకు, లక్ష్మీ నరసింహ స్వామి టెంపుల్ దగ్గర రోడ్డు నిర్మాణం పనులకు జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, తహసిల్దార్ పాండు నాయక్, ఎంపీడీఓ కతలప్ప, ఎంపీడీఓ కమలేశ్వర్ రావు, జడ్పీటీసీ మాధురి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, మండల సీనియర్ నాయకులు ముంతమల్లయ్య, కరుణాకర్‌రెడ్డి, వల్లభాపురం సాయిరాం, మండల, గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

## అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలి

**● తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్**



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** అకాల వర్షాల వలన పంటలు దెబ్బతిన్న, ప్రభుత్వం ఇప్పటికి నష్టపరిహారం ఇవ్వడం లేదని ఇటీవల తెలంగాణ రైతు సంఘం బృందం పర్యటించి రైతాంగాన్ని కలిసిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ గుర్తు చేశారు. శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వనపర్తి వ్యవసాయ మార్కెట్ లోని వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రోడ్లపై ఆరబోసిన ధాన్యం తడిముద్దైందని, ధాన్యానికి అడుగు భాగాన మొలకలు వచ్చాయని అన్నారు. ఆరుకాలం కష్టపడి పండించిన ధాన్యం నేలపాలైందని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో రైతులకు వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, వరి కోసి రోడ్లపై ఆరపెట్టుకున్న ధాన్యం వర్షానికి పూర్తిగా తడిసిపోయిందని, కొన్ని చోట్ల కొనుగోలు చేసిన వడ్లను రైస్ మిల్లుకు తరలించలేదని, అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా హమాలీలను, లారీలను ఏర్పాటు చేయాలని కోరారు. రైస్ మిల్లర్లు తరుగు లేకుండా చూడాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాన్ని మరింత పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.ఇటీవల ఖమ్మంజిల్లాలో ముఖ్యమంత్రి అకాల వర్షాలకు నష్టపరిహారం రైతులకు ఎకరాకు రూ. 10వేలు ఇస్తామని ప్రకటించారని అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన సర్క్యులర్ ను సవరించి వరిపంట ఎకరాకు రూ. 20వేలు పరిహారం అందివ్వాలని, వాణిజ్య పంటలకు రూ. 40వేలు అందించాలని, కౌలు రైతులను కూడా పరిగణంలోకి తీసుకొని ఆదుకోవాలని సూచించారు. ఏకకాలంలో రుణమాఫీ చేసి రైతులకు రుణాలు ఇవ్వాలని, ధరణి భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన వారిలో రాష్ట్రనాయకులు జబ్బార్, జిల్లాఅధ్యక్షుడు బాల్‌రెడ్డి,జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి, జిల్లా నాయకులు భాస్కర్‌లు ఉన్నారు.

## వల్లూరు, బట్లదిన్నె గ్రామాలను ఎర్రవల్లి కొత్త మండలంలో కలపాలి



ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు, గ్రామస్తులు

**ఇటిక్యాల,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** మండల పరిధిలోని వల్లూరు, బట్లదిన్నె గ్రామాలను ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసే ఎర్రవల్లి మండలంలో మా గ్రామాలను కలపాలని శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ చల్లా వెంకటరాంరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి వారితో మాట్లాడుతూ వల్లూరు, బట్లదిన్నె గ్రామాలను కొత్త ఎర్రవల్లి మండలంలో కలిపేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని వారికి హామీ ఇచ్చారు.ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డిని కలిసిన వారిలో షేక్‌పల్లి సర్పంచ్ రవిందర్‌రెడ్డి,అలంపూర్ మారెకట్ యార్డు మాజీచైర్మన్ రాందేవ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి,ప్రతాప్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, తిక్కారెడ్డి, జనార్ధన్, మహేష్, భీముడు, వెంకటేష్ పాల్గొన్నారు.

## గురుకులాలు చాలా ఉత్తమమైన పాఠశాలలు

**బాల బాలికలు విద్యలో రాణించి ఉన్నత స్థానాలు పొందాలి : నారాయణ పేట కలెక్టర్ కోయ శ్రీహర్ష**



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, హాజరైన విద్యార్థినీ, విద్యార్థులు

**నారాయణపేట ప్రతినిధి,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** బాల బాలికలు విద్యలో రాణించి ఉన్నత స్థానాలు పొందాలని జిల్లా కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా గురుకులాల్లో చేరిన విద్యార్థులు వేసవి సెలవుల్లో జిల్లా కలెక్టర్‌ను కలిసి వారి ఆశీస్సులను పొందారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులను ద్దేశించి మాట్లాడుతూ గురుకులాలు చాలా ఉత్తమమైన పాఠశాలలు అని అందులో చదువుకోవడం గొప్ప అదృష్టమన్నారు. ప్రతి విషయాలు క్షుణ్ణంగా నేర్చుకోవాలని, నేర్చుకోవడానికి హద్దులు లేవన్నారు. గురుకులాల్లో చదువులు, వసతు లు గూర్చి పిల్లలను అడిగి తెలుసుకున్నారు. తమ పాఠశాలలో తాము ఊహించనంతగా గొప్ప వసతులు ఉన్నా యని, ఎక్కాలు రాని తాము ఇప్పుడు ఇరవై ఎక్కాలు అవలీలగా చెప్పగలుగుతున్నాం అన్నారు. పిల్లలతో మాట్లా డుతున్నంత సేపు కలెక్టర్ కోయ శ్రీహర్ష మోములో చిరునవ్వు ఉండిపోయింది. జిల్లా నుండి పెద్దఎత్తున పిల్లలను గురుకులాల్లో చేర్పించిన డిడబ్ల్యుఓ వేణుగోపాల్‌ను,ప్రొటెక్షన్ ఆఫీసర్ కవితను కలెక్టర్ అభినందించారు.

**మధ్యలో చదువు మానేసిన పిల్లలు ఓపెన్ స్కూల్స్‌లో చేరండి:** అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలో మానేసిన పిల్లలు తప్పకుండా ఓపెన్ స్కూల్స్‌లో చేరి పది, ఇంటర్, డిగ్రీలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు. వారికి సహాయం చేయడం కోసం జిల్లాలోని నారాయణపేట, మక్తల్, మద్దూరు అంగన్‌వాడి సిడిపిఓ ఆఫీసలలో కెరీర్ అడ్వాన్స్‌మెంట్, కౌన్సిలింగ్ సెంటర్‌లను ప్రారంభించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సెంటర్‌లో ఒకకౌన్సిలర్ అందుబాటులో ఉండిఓపెన్ స్కూల్‌లో పిల్లలు చేరడానికి అన్నివిధాలా సహాయం చేస్తారు. అదేవిధంగా ఆన్‌లైన్ పాఠాలు వినడానికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## మేడే ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ

**● గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**



సమావేశంలో మాట్లాడుతున కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** జిల్లాలో మేడే వారోత్సవాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసిందని జిల్లాకలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో కార్మికశాఖ ట్రాన్స్‌పోర్టు, వ్యవసాయం, సివిల్‌సప్లై,చేనేతశాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో మేడే సందర్భంగా ప్రతిశాఖ నుండి 100 మందిని సమీకరించి ఆయా శాఖల తరపున ఉన్న పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. భవన నిర్మాణ కార్మికులు, బీడీ కార్మికులు, చేనేత కార్మికులు, ఏ శాఖల లో ఏ పథకాలు అమలులో ఉన్నాయో వాటిపై అందరికి అవగాహన కల్పించాలన్నారు. శాఖల వారిగా ఉన్న సంక్షేమ పథకాలపై వివరించి ఐడెంటిటి కార్డులు పంపిణీ చేయుటకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మేనెల రెండవ తేదీన కార్మిక భవన నిర్మాణం కొరకు ఫౌండేషనన స్టోన్ కార్యక్రమాన్ని చేయుటకు ఇన్విటేషన్ తయారు చేయించాలని కార్మికశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో కార్మికశాఖ అధికారి మహేష్, ట్రాన్స్ పోర్టు పురుషోత్తంరెడ్డి, సివిల్ సప్లయ్ అధికారి రేవతి, సంగీతలక్ష్మి, డిఎల్‌పిఓ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## నేడు కానిస్టేబుల్ రాత పరీక్ష

- **నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు**
- **హాజరుకానున్న 14,388 మంది అభ్యర్థులు**
- **ఒక్క పోస్టుకు 20మంది పోటీ**
- **పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్**
- **31కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి**
- **మూడంచెల బందోబస్తు : ఎస్పీ**



(ఫైల్)

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఆదివారం తుది రాత పరీక్ష జరుగనున్నది. ఈమేరకు అన్నిరకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికార యంత్రాంగం తెలిపింది. ఈమేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో 31పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలుతీసుకున్నారు.ఈమేరకు అధికారులు ఇప్పటికే సమావే శాలు నిర్వహించి పరీక్ష నిర్వహణకు సిబ్బందికి సూచనలు సలహాలు జారీ చేశారు.

**పరీక్షా కేంద్రాలు:** మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 31 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో భూత్పూర్, మహబూబ్‌నగర్‌లో కలిసి పరీక్ష నిర్వహించనున్నారు.ఆదివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నాం 1గంట వరకు పరీక్ష జరుగనున్నది. ఈ పరీక్షకు ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి 14,388 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఒక్కో పోస్టుకు దాదాపు 20 మంది పోటీపడుతున్నట్లు తెలుస్తుంది. ఉమ్మడి జిల్లాలో 746 పోస్టులు ఉన్నట్లు సమాచారం. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించిట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ తెలిపారు. కేంద్రాల చుట్టూ ఉన్న జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్లను మూసి ఉంచనున్నట్లు వెల్లడించారు.

**అభ్యర్థులకు సూచనలు**

- నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోని అనుమతి లేదు
- అభ్యర్థులు కేంద్రానికి ఎలాంటి ఎలక్ట్రిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, బ్యాగులు వస్తువులు తీసుకురావొద్దు
- బ్లాక్ లేదా బ్లూ పెన్ తీసుకురావాలని, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి.
- పరీక్ష ప్రారంభం అయిన తర్వాత కేంద్రంలోకి అనుమతించబడదు
- పరీక్షా హాల్లోకి అభ్యర్థులను అరగంట ముందుగానే పంపించడం జరుగుతుంది.
- అభ్యర్థులు ఓఎంఆర్ షీట్ పై ఎలాంటి గీతలు, బొమ్మలు వేసినా జవాబుపత్రాన్ని పరిగణలోకి తీసుకోబడదు.
- పరీక్ష హాల్లో అభ్యర్థి ఫొటో, వేలిముద్రలు పరిశీలించడం జరుగుతుంది.
- అభ్యర్థులు మెహందీ, సిరా, ఇతర పెయింటింగ్స్ టాటూ చేతులపై వేసుకోరాదు
- హాల్ టికెట్ వెనకాల నియమ నిబంధనలు తప్పనిసరి చదువుకోవాలి.

**250 మందితో భారీ భద్రత..**



కానిస్టేబుల్ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశాం.అడిషనల్ ఎస్పీ, 3 డీఎస్పీలు, 10 సీఐలు, 40మందిది ఎస్సైలతోపాటు 200 మంది సిబ్బందితో ఎలాంటి అవాంచనీయ సఘటనలు జరుగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాం. అభ్యర్థులకు తగిన బస్ సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ ఆర్ఎం కోరాము. పరీక్షా కేంద్రం లోకి ఇన్వి జిలేటర్,చీఫ్ సూపరింటెండెంట్, ఇతర సిబ్బంది కూడా ఎవరూ కూడా సెల్‌ఫోన్ తీసుకురాకూడదు.

*- నరసింహ,ఎస్పీ మహబూబ్‌నగర్*

## గ్రామంలో సోదరభావంతో కలిసి ఉండాలి



కొండేరులో పౌరహక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్

**ఇటిక్యాల,ఫిబ్రవరి29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొండేరు గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాలలో అన్ని వర్గాల వారు సోదర భావంతో కలిసి ఉండాలని హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి, దేవాలయ ప్రవేశం అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆర్ఐ ప్రశాంత్‌గౌడ్ గ్రామస్తులకు ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈరన్న, నాయకులు వీరన్న, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బీచుపల్లిలో సుప్రీంకోర్టు జడ్జి పూజలు



బీచుపల్లి ఆలయ సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి పామిగుంట నరసింహ దంపతులు, జిల్లా జడ్జి

**ఇటిక్యాల,ఫిబ్రవరి29 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం సుప్రీంకోర్టు జడ్జి పామిడిగంటం నరసింహ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో జోగులాంబ గద్వాల జిల్లా జడ్జి అన్నిరోస్ క్రిస్టియన్ పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్ఐప్రశాంత్‌గౌడ్, అలంపూర్ సూర్యనాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## పీయూలో ఎంబీఏ విద్యార్థుల సెమినార్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలోని ఎంబీఏ విభాగంలో శనివారం విద్యార్థులు సెమినార్ నిర్వహించారు. విద్యార్థులను ఆరు మంది సభ్యులుగా కొన్ని సమూహాలుగా చేసి ప్రజెంటేషన్ నిర్వహించారు. కస్టమర్ రిలేషన్‌షిప్, మేనేజ్‌మెంట్ అంశంపై ప్రదర్శనలు ఇచ్చారు. సీఆర్ఎం పరిచయం, అమలు, అప్లికేషన్‌లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఇలాంటి కార్యకలాపాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో స్కిల్ డెవలప్‌మెంట్, కమ్యూనికేషన్, ఆత్మవిశ్వాసం, చర్చించే విషయంపై అవగాహన, బాధ్యత పంచుకోవడం, ఇబ్బందులు ఎదుర్కోవడం, బహిరంగంగా మాట్లాడడం వంటి అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగిందన్నారు. ప్రిన్సిపాల్ ఎన్ కిషోర్ టాపర్లను అభినందించారు.

## నూతన దంపతులకు పెళ్లిబట్టలు అందజేత



**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** పట్టణంలోని 31వ వార్డు బస్ డిపో వెనుక భాగం (రాజీవ్ మార్గ్ లెఫ్ట్‌సైడ్) కాలనీ లో కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు సంగీత దంపతులు కీ॥శే॥ ఈనమ్మ, కీ॥శే॥ మల్లేష్ దంప తుల ప్రథమ పుత్రుడు నవీన్ కుమార్ వివాహం రత్నమాలతో నిర్వహించనుండా నూతన వధూవరులకు పెళ్లిబట్టలు, పుస్తెమెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా వారి స్వగృహానికి 31వవార్డు కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు సంగీత,ప్రత్యేకంగా వెళ్లి నూతన వధూవరులకుపుస్తెమెట్టెలు, కొత్త బట్టలు అంద జేసి వారిని ఆశీర్వదించారు.

## పాలమూరు రెడ్డి సేవా సమితి వార్షికోత్సవ వేడుకలు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 29,ప్రభాతవార్త:** పాలమూరురెడ్డి సేవా సమితి 21వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లురెడ్డి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం రాయిచూర్ రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని రాజా బహద్దూర్‌రెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెడ్డి సోదరులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మే 2వ తేదీన ఆధార్ అప్డేషన్ కేంద్రాలు ఏర్పాటు



వనపర్తి తహసీల్దార్, రాజేందర్ గౌడ్

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశానుసారం వచ్చేనెల 2వ తేదీన వనపర్తి మండలంలోని అన్ని గ్రామాల వారీగా, మున్సిపల్ వార్డుల వారీగా ఆధార్ అప్డేషన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, కావున 2010 సంవత్సరం నుండి 2016 సంవత్సరం మధ్యలో ఆధార్‌కార్డు పొందిన వారు గ్రామాల వారీగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో మీ యొక్క ఆధార్ అప్డేట్ చేసుకోవాలని వనపర్తి తహసిల్దార్ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలి



వైఎస్ఆర్ టీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 1500 వరకు క్వాలిఫైడ్ అభ్యర్థులు ఉన్నారని, వారికి తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ మిమ్మల్ని పర్మినెంట్ చేస్తానని హామీఇచ్చారు కానీ నేటి వరకు హామీ నెరవేరలేని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.వెంకటేశ్వర్లు అన్నారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ కేసీఆర్ 2016లో వారితో చర్చలు జరిపి మీకు మానవతా దృక్పథంతో వయో పరిమితితో సంబంధం లేకుండా ఉద్యోగాలు ఇస్తామని భరోసా ఇచ్చారు, లీగల్ టెక్నికల్ సమస్యలున్న సరిదిద్దు తామని అన్నారని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ చెప్పారు కానీ ఇంతవరకు ఉద్యోగాలు ఇవ్వలేదు, అందరు ప్రైవేటు స్కూళ్లలో, కాలేజీలల్లో టీచర్లుగా,లెక్చరర్లుగా చాలీచాలనిజీతాలతో పని చేస్తున్నారని,పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారు కావున తెలంగాణరాష్ట్రంలోవారికి వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.

**తెలంగాణ నూతన సచివాలయ ప్రారంభోత్సవానికి ప్రజలు భారీగా తరలిరావాలి**

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర నూతన డా.బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయం ప్రారంభోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వనపర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్.శివశంకర్ పిలుపునిచ్చారు. నూతన సచివాలయానికి డా.బీ.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం పట్ల హర్షం వక్తం చేస్తూ సీఎం కేసీఆర్, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నిరుపేద ప్రజలకు వరంగా కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్

**● ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి**



కళ్యాణలక్ష్మీ చెక్కు అవదజేస్తున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

**వీపనగండ్ల,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన 61మంది లబ్దిదారులకు కళ్యా ణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే బీరం హర్షవర్దన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆడబిడ్డల పెండ్లికి సీఎం కేసీఆర్ పెద్దన్నగా నిలిచి రూ.1లక్ష116 అందజేస్తున్నారని అన్నారు. కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ పథకాల ద్వారా నిరుపేద కుటుంబీకులకు ఎంతో లబ్ది పొందుతున్నారని అన్నారు. పేదింటి ఆడ పిల్లలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పథకాలు అందిస్తున్నారని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంతవరకు కళ్యాణలక్ష్మీ పథకం కొనసాగుతుందని అన్నారు. మహిళల సంక్షేమానికి, మహిళల భద్రతకు బీఆం ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, మహిళలకు రక్షణగా 24గంటలు షీ టీమ్స్ పనిచేస్తున్నాయని అన్నారు. సీఎం కేసీఆర్ సారథ్యంలో బృహత్తర సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్నాయని అన్నారు. గర్భిణీ స్త్రీలకు ప్రభుత్వ వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచి తంగా ఇస్తున్నామని, ప్రభుత్వ ఆసుపత్రి అంటేనే సాధారణ ప్రసవాలు గుర్తుకు వచ్చేలా కృషి చేస్తోందని అన్నా రు. ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయితే రూ.12వేలతో పాటు కేసీఆర్ కిట్, తల్లిబిడ్డల సంరక్షణ కొరకు ప్రభు త్వం అందిస్తుందని అన్నారు. కేసీఆర్ పాలనలో ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించారని, ప్రతి ఆసుపత్రిలో కార్పోరేట్ వైద్యాన్ని అందిస్తున్నామని అన్నారు. 57సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి, వికలాంగులకు, వితంతువులకు, ఒంటరి మహిళలకు ఆసరా పెన్షన్లు అందిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్ రావు, సర్పంచు వంగూరు నరసింహారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, రైతు బంధు సమితి అధ్యక్షుడు ఎత్తం కృష్ణయ్య, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట నష్టపరిహారం చెల్లించి అన్నదాతలను ఆదుకోవాలి

**బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ ఇంచార్జీ నాగనమోని చెన్నరాములు**



వనపర్తి వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ లక్ష్మయ్యతో మాట్లాడుతున్న బీఎస్పీ ప్రతినిధి బృందం

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** రైతులను ఇబ్బంది పెట్టకుండా సత్వరమే మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేయాలని బీఎస్పీ అసెంబ్లీ ఇంచార్జ్ నాగనమోని చెన్నరాములు పేర్కొన్నారు. శనివారం బీఎస్ప ప్రతినిధి బృదంతో వనపర్తి మార్కెట్ యార్డును సందర్శించి రైతులను సంప్రదించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ సెక్రటరీ లక్ష్మయ్య గౌడ్ తో చర్చించి రైతుల సమస్యలు మార్కెట్ యార్డులో వర్షపు నీటి పారుదల, డ్రైనేజీ సిస్టం మార్చి రైతుల ధాన్యం మునిగిపోకుండా నీటిని మళ్లించాలని, పంటల సాగు బడి, దిగుబడి పెరిగినందున ప్రస్తుతం మార్కెట్ లో నిర్మించిన రెండు షెడ్లు సరిపోక, అదనంగా మరో 20షెడ్లు నిర్మించాలని, అలాగే రైతులకు విశ్రాంతి గదులు నిర్మించాలని రైతులకు, హమాలీలకు రూ.5భోజన సదుపాయం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మిస్తున్న నివాస గృహాలను మైదానం మధ్యలో కాకుండా ప్రహరీ గోడ అంచుకు నిర్మించాలని తెలిపారు. వ్యాపారస్తులు రైతులను ఇబ్బంది పెట్టకుండా సత్వరమే మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేయాలనిఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని కోరారు. సెక్రటరీ లక్ష్మయ్యగౌడ్ హామీ ఇస్తూ సంబంధిత పై అధికారులతో మాట్లాడి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాఘణపురం కృష్ణ, ప్రధాన కార్యదర్శి మిద్దె మహేష్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గడ్డం మహేష్, జిల్లా కార్యదర్శి మొల్గర తిరుమలేష్, బహుజనరమేష్, అసెంబ్లీ అధ్యక్షుడు గట్టు మన్నెం, బీవీఎఫ్ జిల్లా కో కన్వీనర్ ఎన్.శుభాష్ చంద్ర, వంశీకృష్ణ, కాటికె కురుమయ్య, చంద్రశేఖర్, భాస్కర్, సుదర్శన్ శెట్టి, బోయ బండలయ్య పాల్గొన్నారు.

## నేడు వాసవిమాత అమ్మవారి జయంతి వేడుకలు



దేవరకద్రలో వాసవిమాత దేవస్థానం

**దేవరకద్ర,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** దేవరకద్రలో కొలువుదీరిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరిమాత అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది అమ్మవారి జయంతి వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ అమ్మవారి జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జయంతి వేడుకల సందర్భంగా ఉదయం 7లకు స్థానిక శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాం నుండి మహిళలచేత శోభాయాత్ర నిర్వహించనున్నారు. మంగళహారతుల పాటు మంగళ వాయిద్యాతో ఈ శోభాయాత్రను నిర్వహించనున్నారు. 9లకు వాసవికన్యకా పరమేశ్వరిదేవి దేవాలయంలో కలశపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 10లకు కళశాలతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అనంతరం గత 27 రోజులుగా అమ్మవారికి అర్పించిన వస్తువులు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. 11లకు అమ్మవారికి ఒడిబియ్యం కార్యక్రమం థక్ష పాటు మధ్యాహ్నం 12.30లకు అమ్మవారికి 24 రకాలతో నైవేధ్యాలతో హరతుల కార్యక్రమం. 1లకు అమ్మవారికి మహా మంగళహారతి, తీర్థప్రసాదవితరణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అలాగే 5లకు గోధుమపిండితో దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. రాత్రి 8లకు ఊయలసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. భక్తులకు టిఫిన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. కావున ఈ కార్యక్రమానికి స్థానిక ఆర్య వైశ్యులు అధికసంఖ్యలో హాజరుకావాలని నిర్వహకులు కోరారు.

**అమ్మవారి జయంతి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి:**

**జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణి**



దేవరకద్రలో శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిమాత అమ్మవారి జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగింది. ప్రతి ఏడాది అమ్మ వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తాము. అందులో భాగం గానే ఈ ఏడాది కూడ అమ్మవారి జయంతి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశాం. కావున ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలి

## వరి కొనుగోళ్లు కేంద్రాన్ని పరిశీలించిన తహసీల్దార్, మనిగిళ్ల ఉపసర్పంచ్



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సంధ్య, మనిగిళ్ల ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్

**పెద్దమందడి,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని శనివారం మనిగిళ్ల ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ చేరుకొని రైతుల ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించగా వెంటనే స్పందించిన ఆమె అక్కడికి చేరుకొని తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆమె హామీ ఇవ్వడం జరిగింది. అకాల వర్షాలు వస్తే లోతట్టు ప్రాంతంలో ఉన్న ధాన్యం తడిసే అవకాశం ఉందని, ఎంఆర్ఓ కి ఫోన్ చేసి మనిగిళ్ల గ్రామానికి లారీలను పంపమని కోరడం జరిగింది. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అందులో భాగంగానే లారీలను పిలిచి వెంటనే లోడ్ చేయాలని ఆమె సూచించారు. ఆమె వెంట ఆర్ఐ తిరుతపయ్య, గ్రామ రైతులు ఊదరిరాములు, బాల్‌రెడ్డి, రాములు సాగర్, కుమ్మరి తిరుపతయ్య, వడ్డె చంద్రయ్య, వడ్డె రాజు, ప్రతాప్ రెడ్డి, కృష్ణా రెడ్డి, ఊదరి నాగరాజు, ఐకేపీ ఇంచార్జ్ సువర్ణ, సునిత, తదితరులు ఉన్నారు.

## అలంపూర్ నియోజకవర్గంలో ఏడు మండలాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

**ఏకగ్రీవంగా ప్రకటించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేనరెడ్డి**



**ఇటిక్యాల,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** అలంపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలకు యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగ నిరసన ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తుండగా ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన ఆయన జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఎంపిక చేశారు. ఎంపికలో జోగులాంబ గద్వాల జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ, అలంపూర్ తాలూకా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సర్పంచ్ రవి సూచించిన మేరకు ఏడు మండలాల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ఆయన నియమించి ఈ సందర్భంగా ఎన్నికైన వారికి శివసేనరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపికైన వారిలో వడ్డేపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కృష్ణకాంత్, అలంపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మహేష్, ఉండవల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా రామ్‌రెడ్డి, మానవపాడు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా శేఖర్‌రెడ్డి, ఇటిక్యాల మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రాజ్‌కుమార్, రాజోలి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా సంధ్యబాబులు ఉన్నారు. అంతేకాక జోగులాంబ గద్వాల జల్లా యూత్ కాంగ్రెస్ సెక్రటరీగా జితెందర్‌ను, జోగులాంబ గద్వాల జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా పులెందర్‌ను నియమించారు. మాకు యూత్ కాంగ్రెస్‌లో అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కెసిఆర్ ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తామని వారు పేర్కొన్నారు.

## మున్సిపల్ సాధారణ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్




సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**మక్తల్,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపాలిటీ సాధారణ సమావేశం మున్సిపల్ కార్యాలయంలో మధ్యాహ్నం 2గం.లకు నిర్వహించారు. ఈసందర్భంగా ఎజెండా అంశాలుగా 37 అంశాలను మున్సిపల్ కౌన్సిల్ ప్రవేశపెట్టింది. మరి ముఖ్యంగా పారిశుధ్య విభాగం మున్సిపల్ పనుల కొరకు రెండు లక్షలు ఐదో వార్డులో నీటి సరఫరా కొరకు లక్ష పెండింగ్ బిల్లులు ఎలక్ట్రానిక్ మోటార్ రిపేర్ల నిమిత్తం ఐదు లక్షలు, ఎండాకాలంలో చలివేంద్రం ఏర్పాటుకు రూ. 50 వేలు 37 అంశాలు ప్రవేశపెట్టి కొన్నింటి మినహా అన్ని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈసందర్భంగా 11వ అంశంగా ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర ప్రజావసరాల నిమిత్తం సిట్టింగ్ షెడ్ గ్యాలరీ క్యాంటిన్ గార్డు సిబ్బంది గదుల రిపేర్ నిమిత్తం డిఎంఎఫ్ పట్టణ ప్రగతి నిధుల నుండి పనులు చేయించడం జరిగిందని కౌన్సిల్ తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అడిషనల్ కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేటప్పుడు కనీసం సమాచారం ఇవ్వలేదని ప్రభుత్వ ఆసుపత్రికి ఛైర్మన్‌కు ఎమ్మెల్యే ఉంటారని తెలియదా తనకు ఇష్టం వచ్చినట్లు రావడం వెళ్లడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా అడిషనల్ కలెక్టర్ మక్తల్‌కు వెళ్లేటప్పుడు ఆయన వాహనం స్పీడు అధికంగా ఉంటుందని ఆస్పీడు తగ్గించుకోవాలని అన్నారు. జిల్లా అధికారులు మక్తల్‌కు వచ్చేటప్పుడు కనీసం సమాచారం ఇవ్వరా అన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రతి ఒక్కరు వార్డు సమస్యల కొరకు ప్రత్యేక నిధులు అనగా ఎమ్మెల్యే నిధుల నుండి ఐదు లక్షల చొప్పున కౌన్సిల్ ఆమోదం తెలిపిందని ప్రతి ఒక్కరు కూడా వారివారి వార్డులలో అవసరాలకు వినియోగించుకోవాలని అన్నారు. కౌన్సిల్ సమావేశానికి కొందరు సభ్యులు గైర్హాజం య్యారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు

## టీచర్ల ప్రమోషన్లకు మోక్షమెప్పుడు?

**వనపర్తి ప్రతినిధి,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగంలోకి ప్రవేశించిన ప్రతి ఉద్యోగికి విధివారి అర్హతల మేరకు పదోన్నతలు కల్పించడం, నిర్ణిత కాల వ్యవధి పూర్తి అవ్వగానే, బదిలీలు కల్పించడం ప్రభుత్వ బాద్యత కానీ, ప్రభుత్వ ఉద్యోగుల్లో మిగతా శాఖల పరిస్థితి ఎలా ఉన్నా, టీచర్ల విషయానికి వస్తే వారికి పదోన్నతలు, బదిలీలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. ఇప్పటికే ఒకే క్యాడర్‌లో 24 సంవత్సరాలు పూర్తి చేసుకొని పదవి విరమణ చేసిన ఉపాధ్యాయుఉలు కోకొల్లలు.

**వాళ్లు చేసిన పాపమేంటి..? :** ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత కేవలం ఒకేసారి 2015లో రాష్ట్ర ప్రభుత్వం పదోన్నతలు కల్పించింది. కానీ గత 8ఏళ్లుగా పదోన్నతులు, 5ఏళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు తీవ్ర మానసిక వేదనకు గురి అవుతున్నారనేది వాస్తవం. ఈ బదిలీలకు, ప్రమోషన్లకు ఏకీకృత సర్వీస్ రూల్స్ ప్రధానంగా అడ్డంకిగా ఉన్నాయనుకుంటే, 2009, 2015లో పదోన్నతులు కల్పించిన సందర్భంలో కూడా సర్వీసు రూల్స్ ని ప్రభుత్వం పాటించలేదు. కానీ ఉన్నత న్యాయ స్థానం తుది తీర్పుకు లోబడి అనే వాక్యం చేర్చి ప్రక్రియను పూర్తి చేసింది. మరి ప్రస్తుతం అదే విధానాన్ని కొనసాగిస్తూ పదోన్నతలు ప్రక్రియను ఎందుకు పూర్తి చేయడం లేదు? నిజానికి ఉపాధ్యాయ ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని, ఖాళీలు 10%మించకూడదని, విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 26 సూచిస్తుంది. కానీ అవేవి ప్రభుత్వం పట్టించుకోకుండా ఇంచార్జీలతోనే కాలం వెళ్లదీస్తోంది. విద్యా వ్యవస్థకు దిశా నిర్దేశం, భావి భారత ఉపాధ్యాయులను తయారు చేసే జిల్లా, ఉపాధ్యాయ శిక్షణ సంస్థలు, రాష్ట్ర విద్యా పరిశోధక శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ) లోని అధ్యాపకులు, ప్రొఫెసర్లు కేవలం 6% మాత్రమే పని చేస్తున్నారు. అలాగే పాఠశాల విద్యాశాఖలో జిల్లా విద్యాశాఖాధికారులు, మండల విద్యాధికారులు, ఇంచార్జీల పాలన కొనసాగుతోంది. రాష్ట్రంలోని 607 మండలాలకు గాను కేవలం 21 రెగ్యులర్‌ఎంఓ ఏలే పనిచేయడం నేటిదుస్థితికిఅద్దం పడుతుంది, విద్యాశాఖలో కారుణ్య నియామక పథకం కింద జూనియర్ అసిస్టెంట్‌గా నియామకం అయినవారు, నేడు అడిషనల్ డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి హోదాలో ఉండడం అంతకన్నా ముందే నియామకమైన టీచర్లు మాత్రం పదోన్నతులు లేక అదే క్యాడర్ లో పదవి విరమణ పొందడం టీచర్లు చేసుకున్న పాపమా..?

**ఈ సెలవుల్లోనైనా పూర్తయ్యేనా..? :** నిజానికి టీచర్ల ప్రమోషన్‌లు వారి వ్యక్తిగత ప్రయోజనంగా భావించడకూడదు, అది లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుకు, వారి విద్యాభ్యాసానికి పాఠశాల, విద్యాబలోపేతానికి చెందిన అంశంగా భావించాలి. చాలా ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు దిశా నిర్దేశం చేసే ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సబ్జెక్టుకు టీచర్ల కొరత వెంటాడుతుంది. వర్క్ అడ్జిస్ట్మెంట్, విద్యా వాలంటీర్ల వైపు దృష్టిసారిస్తున్న ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం పై శ్రద్ద తీసుకున్నట్లు అయితే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేది. చివరికి ఉపాధ్యాయ సంఘాల పోరాటాల ఫలితంగా పరీక్షలు సమీపిస్తున్న ధశలో ఎమ్మెల్సీ ఎన్నికల తరుణంలో జనవరిలో హడావిడి బదిలీలు, పదోన్నతులు సుదీర్ఘ షెడ్యూల్, విడుదల చేయడంతో ఉపాధ్యాయుల్లో ఆశలు చిగురించాయి. కానీ విడుదల చేసిన ఉత్తర్వుల్లో స్పష్టత లేకపోవడంతో కొందరు ఉపాధ్యాయులు తమకు నష్టం జరుగుతుందని, న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు స్టే విధించడంతో ఆగిపోయాయి. ఈ వేసవి సెలవుల్లోనైనా ప్రక్రియ పూర్తి అవుతుందని టీచర్లు ఆశతో ఎదురుచూస్తున్నారు. అందుకే ప్రభుత్వం ఇప్పటికైనా కోర్టు కేసుల పేరుతో కాలయాపన చేయకుండా బదిలీలు, పదోన్నతులు ప్రక్రియను పూర్తి చేయాలి. పదోన్నతులకు శాశ్వత బదిలీలు కోడ్‌ను రూపొందించాలి. బదిలీలు, ప్రమోష న్లు చేపట్టే ముందు ఉపాధ్యాయ ఎమ్మెల్యేలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో కులంకుషంగా చర్చించిన అనంతరం ఉత్తర్వులు విడుదల చేయాలి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరిగా నెలవారి ప్రమోషన్ల పద్దతిని కొనసాగించాలి. ప్రమోషన్ల పేరుతో టీచర్ల భావోద్వేగాలతో ఆడుకోకుండా త్వరగా ప్రక్రియ పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలి.



ఎన్.విష్ణుమూర్తి
ఎస్‌జీటీ యూపీఎస్ యాదిరెడ్డిపల్లి,
తాడూరు మండలం.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా ప్రధాన రోడ్డుపై అడ్డంగా ఉన్న లైను మార్చడం, స్థంభాలు పాతడం, 11కెవి లైన్ లాగడం, పాత ఎల్‌టీ లైన్ కు ఉన్న గృహ, వ్యాపార, పరిశ్రమల వైర్లను కొత్తగా లాగిన వైర్‌లకు కలపడం లాంటి పనులు నేడు శ్రీరామ టాకీస్ ఏరియాలో విద్యుత్ సరఫరాలో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు అంతరాయం ఉంటుందని, కనుక ఆయా ఏరియాల్లోని గృహ, వ్యాపార, పరిశ్రమలకు సంబంధించిన వినియోగదారులు సహకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.తులసి ఒక ప్రకటలో తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



**వీపనగండ్ల,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని వనపర్తి జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనుల గురించి అదే విధంగా ధరణి పోర్టల్ గురించి తహసిల్దార్ పాండు నాయక్‌లు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ రికార్డులను ఆయన పరిశీలించారు.

## కులమత విభేదాలు లేకుండా అందరు కలిసి మెలిసి ఉండాలి : ఎస్సై

**లింగాల,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** కులమత విభేదాలు లేకుండా సమాజంలో అందరు కలిసి మెలిసి ఉండాలని ఎస్సై శ్రీనివాస్ అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని సూరపూర్ గ్రామ పంచాయతీలోని దళితులను శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలోకి ఆలయ ప్రవేశం చేయించి, స్వామివారికి దళితులచే ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో దళితులను చిన్నచూపు చూడరాదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాత్క లక్ష్మమ్మ శ్రీనివాస్ యాదవ్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తిరుపతమ్మ, ఎఫ్ఆర్‌డిఎస్ స్వచ్ఛంద సంస్థ శ్రీనివాసులు, రాముడు, సాయి, శాంతమ్మ, బొందమ్మ, రాములు, బాలయ్య, గణపతి, నిరంజన్, బాలయ్య పాల్గొన్నారు.

# సీపీఆర్ విధానంపై అవగాహన కార్యక్రమం

◆గుండెపోటు భారిన పడిన వ్యక్తులను ప్రాణపాయ స్థితి నుంచి కాపాడవచ్చు : కల్వకుర్తి,మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బందికి సీపీఆర్‌పై శనివారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాట్లాడుతూ సీపీఆర్ అంటే ఒక వ్యక్తి యొక్క గుండె కొట్టుకోవడం స్తంభించినప్పుడు లేదా ఊపిరి తిత్తులు శ్వాసతీసుకొని స్థితిలో ఉన్నప్పుడు వెంటనే ఆ చర్యల పునరుద్ధరణకు చేయు అత్యవసర ప్రక్రియ. ఈ ప్రక్రియ ద్వారా గుండె పోటు భారిన పడిన వ్యక్తులను వెంటనే కాపాడవచ్చునని ఆయన పేర్కొ న్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ మాట్లాడుతూ గుండె కొట్టుకోవడం ఆగిపోయినప్పుడు అత్యవసరంగా ప్రాణాలను రక్షించే విధానాన్నే హృదయశ్వాకోస పునర్జీవన చర్య(కార్డియోపల్మోనరి రిసిసిటేషన్)చేసి గుండ పోటు భారిన పడిన వ్యక్తులను కాపాడటానికి ప్రథమ ప్రక్రియ అని తెలిపారు. అదే విధంగా డాక్టర్ శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గుండెపోటు వలన పడిపోయిన మనిషిని వెంటనే సీపీఆర్ చర్య ప్రారంభిం చాలని, తీవ్రమైన గుండెపోటు ద్వారా గుండె కొట్టుకోవడం ఆగిపోయిన శరీరంలో రక్తం మరియు ఆక్సిజన్ సరఫరా ఆగిపోతుందన్నారు. అలాంటి సమయంలో సీపీఆర్ చేయాలన్నారు.మేనేజర్ రాజకుమారి,డాక్టర్‌మోహన్, దక్యనాయక్, సురేందర్‌రెడ్డి, దుర్గయ్య, మున్సి పల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## భూ నష్ట పరిహారం అందించాలని వినతి



ఎమ్మెల్సీకి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

**వెల్దండ, ఏప్రిల్29 ప్రభాతవార్త:** కేఎల్ఐ డీ-82 కాల్వల్లో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నేటికి భూ నష్ట పరిహారం అందించలేదని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని శనివారం మర్యాద పూర్వకంగా ఆయన నివాసంలో చొక్కన్నపల్లి గ్రామాల రైతులు భూ నష్ట పరిహారం అందించాలని ఎమ్మెల్సీకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ భూములు కోల్పోయి 5 సంవత్సరాలు గడుస్తున్న నష్ట పరిహారం అందకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ త్వరలోనే రైతులకు భూ నష్ట పరిహారం అందజేస్తామన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో రైతులు బొక్కల శ్రీనివాస్, అల్వాల్‌రెడ్డి, పుట్ట యాదయ్య,దేవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, కే.వెంకట్‌రెడ్డి, శ్రీను, సత్యనారాయణ, బాలస్వామి, వెంకటయ్య,లింగం,లక్ష్మయ్య,శివ,జంగయ్య ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి పరామర్శ



ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

**వంగూరు, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** వంగూరు మండలం చాకలి గుడిసె గ్రామానికి చెందిన చిలికేశ్వరం బుజ్జమ్మ శుక్రవారం పిడుగుపాటుకు గురై మృతి చెందినది. మృతురాలి కుటుంబాన్ని శనివారం సంఘం సభ్యులు పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. మృతురాలి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, నాయకులు శ్రీనివాస్,మేకల కృష్ణయ్య,బాలస్వామి, అశోక్, రవి, అశోక్, సైదులు, సురేందర్, మురళి, నిరంజన్, సైదులు, రేణయ్య తదితరులు ఉన్నారు.

## వేసవి నృత్య శిక్షణ తరగతులు ప్రారంభం



నృత్య శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరప్రసాద్‌రెడ్డి

**కల్వకుర్తి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ఎబీసీడీ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో సమ్మర్ డ్యాన్స్ తరగతులను ఐక్యత ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. వేసవి కాలంలో విద్యార్థులు నృత్యం నేర్చుకోవాలని, చదువుతో పాటు నృత్యం నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఎబీసీడీ డ్యాన్స్ స్టూడియో నిర్వాహకులు టింకు, నాని, పవన్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

## రూ.2 లక్షల ఎల్ఓసి లెటర్ అందజేత



**గద్వాల ప్రతినిధి,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ఎమెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల మండల పరిధిలోని కొండపల్లి గ్రామానికి చెందిన మాస్టర్ టి.కృష్ణ తండ్రి బీచుపల్లికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 2 లక్షల ఎల్ఓసి లెటర్‌ను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్, కౌన్సిలర్లు మురళి, కృష్ణ,ఎంపిటిసిఆనంద్‌గౌడ్,బిఆర్ఎస్ పార్టీనాయకులు గోపిరెడ్డి, నరసింహారెడ్డి,భానుప్రకాష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐఐటి అర్హత సాధించిన విద్యార్థి

**ధరూర్,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన ఐఐటి అర్హత సాధించిన ధరూర్ వాసి సాయిరాహుల్ సిద్ధార్థరెడ్డి 98.9 మార్కులతో రెండు మెయిన్స్ పరీక్షల్లో అర్హత సాధించి జూన్‌లో జరిగే అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించాడు. సాయి రాహుల్ శ్రీ లక్ష్మి స్కూల్ కరస్పాండెంట్ లేట్ విష్ణువర్ధన్‌రెడ్డి కుమారుడు రాహుల్ ప్రస్తుతం హైదరాబాద్, మాదాపూర్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ పూర్తిచేసి ఐఐటి కోచింగ్‌లో ఉన్నాడు. విద్యార్థి అర్హతపై గ్రామస్తులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వీధి నాటకానికి ఆర్థిక చేయూత

**గండీడ్,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** గండీడ్ మండలం పంచలింగాల తండాలో చిరుతల రామాయణం వీధి నాటకానికి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి అందుబాటులో లేనందున 10 వేల ఆర్థిక సాయం ఆయన అనుచరుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి,పిఎసిఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పిఎసిఎస్ డైరెక్టర్ రామ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, పార్టీ అధ్యక్షుడు పెంట్యానాయక్, గ్రామసర్పంచ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



వీధి నాటకానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

# రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

-రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పిస్తాం : మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్‌గౌడ్

**వెల్దండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కేసీఆర్ రైతన్న సంక్షేమం కోసం వినూత్నమైన సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి రైతన్నల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావులు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో శనివారం వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌గౌడ్‌తో కలిసి భాస్కంరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని బయట విక్రయించకుండా ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. తేమ శాతం ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. వరి ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు విజయేందర్‌రెడ్డి, ఏఓ మంజుల, డైరెక్టర్లు మట్ట వెంకటయ్యగౌడ్, శేఖర్ ముదిరాజ్, జంగయ్య, సర్పంచ్ సాయి,నాయకులు వెంకటయ్యగౌడ్, సోమయ్య, రాఘవేందర్, బాలు నాయక్, తిర్మల్‌రావు, సిబ్బంది వెంకట్‌రెడ్డి,శ్రీనివాస్, సాధిక్‌తో పాటు తదితరులు ఉన్నారు.



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..

◆సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి

**వెల్దండ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను క్రమబద్ధికరించాలని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సమ్మె శనివారం 2వ రోజుకు చేరుకుంది. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ కార్యదర్శుల డిమాండ్‌ను నేరవేర్చాలని కోరారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రారెడ్డి, అలీ,పంచాయతీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, మురహరాచారి, అల్తాఫ్,విష్ణు, కృష్ణ, నందకిశోర్, మంజుల, శ్రావణ్, శ్రీనివాస్, రవీందర్, స్వప్న, మహేశ్వరి,అంజనమ్మ, సునిత, హరితరాణి, అన్నపూర్ణ, రాధిక, లక్ష్మమ్మ, తిరుపతమ్మతో పాటు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెల్దండ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి

# నిరుద్యోగ నిరసన ర్యాలీకి కదం తొక్కండి

- తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్29, ప్రభాతవార్త:** నిరుద్యోగ యవతకు, విద్యార్థి లోకానికి భరోసానిచ్చేందుకు ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరసన దీక్షకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారని తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ నుంచి క్లాక్‌టవర్ వరకు నిరుద్యోగ ర్యాలీ నిర్వహించిన అనంతరం క్లాక్‌టవర్ సర్కిల్‌లో నిర్వహించే కార్నర్ మీటింగ్ పాల్గొంటారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాలు లేకుండా చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక ఉద్యోగాలు పోయాయే తప్పా కొత్త ఉద్యోగాలు రాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉద్యోగ క్యాలెండర్ రిలీజ్ చేస్తామని, 2లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. కావునా ఉమ్మడి జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మేధావులు ఘనస్వాగతం పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.అనంతరం క్లాక్‌టవర్ వద్ద మీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.కార్యక్రమంలోటీపీసీసీ ఉపాధ్యక్షుడులు ఒబేదుల్లా కొత్వాల్, ఎర్రశేఖర్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి సంజీవ్ ముదిరాజ్,ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొండాప్రశాంత్‌రెడ్డి, వినోద్,కాటంవినోద్,రంగారావు పాల్గొన్నారు.



క్లాక్‌టవర్ వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి, శివసేనారెడ్డి

## కార్మికుల కనీసవేతనాల పెంపుకై ఉద్యమాలకు సిద్ధం కావాలి

**అమరచింత,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికుల కనీస వేతన పెంపుకై మే డే స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్దంగా కావాలని సీపీఐ(ఎమ్ఎల్)ప్రజాపంధా డివిజన్ నాయకులు సి.రాజు,మండల కార్యదర్శి కె.రాజన్న కార్మికులకు పిలుపునిచ్చారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని సీపీఐ(ఎమ్ఎల్)ప్రజాపంధా జెండా కట్ట దగ్గర 138ం మేడే గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1886లో చికాగోనగరంలో 8గంటల పని దినాల కోసం పోరాటం చేసి సాధించిన ఇప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించే చట్టాలను అమలు చేసిందని వారు అన్నారు. కార్మికుల హక్కులను సాధించడానికి కేంద్ర ప్రభుత్వం లేబర్ చట్టాలను అమలు చేసిందని అన్నారు. కార్మికుల హక్కులను సాధించడానికి కార్మికులు ఐక్యంగా ఉద్యమాలకు సిద్దం కావాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరును వ్యతిరేకించాలని వారు కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎమ్ఎల్)ప్రజాపంధానాయకులు సామేలు,కురుమన్న, జిలాని, భీమన్న,సత్యన్న, ప్రేమరత్నం, రాంచందర్‌జీ, ఏసన్న ఉన్నారు.



మే డే గోడపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

## నిరుద్యోగులను దగా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

◆పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్

**అమరచింత,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** నిరుద్యోగులను దగ చేస్తున్నా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజు గౌడ్ అన్నారు. శనివారం ఆత్మకూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధికారంలోకి వస్తే ఏడాదికి 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు వేశారో చెప్పాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్రం వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి నోటిఫికేషన్ల పేరుతో కాలయాపన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి నిరుద్యోగులు తగినబుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ నేడు మహబూబ్‌నగర్ లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపట్టిన నిరుద్యోగ నిరసన సభకు వేలాదిగా తరలిరావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, పరమేష్, శ్రీను, బాలకృష్ణ,రహ్మతుల్లా, మధు, గంగాధర్, రాములు, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, చిరంజీవి,యాదయ్య,బాలగౌడ్, మహ్మద్, హుస్సేన్‌బాయి, పాష తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

## సీసీ, డ్రైనేజీ పనులు ప్రారంభం

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్29, ప్రభాతవార్త:** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శనివారం 3వ వార్డులో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కాలనీలో డ్రైనేజీ నూతన సీసీ రోడ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కాలనీలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఆమె వెంట కౌన్సిలర్ దేశవాలీ సతీష్‌కుమార్, వార్డు సభ్యులు మంచన పాండయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, పుల్లయ్య, హరీశ్‌గౌడ్,సుధాకర్‌గౌడ్, సత్తయ్య గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

## గ్రామ కార్యదర్శిల నిరవధిక సమ్మె



గ్రామ కార్యదర్శిలు నిరవధిక సమ్మె చేస్తున్న దృశ్యం

**ఉట్కూర్,ఫిబ్రవరి 29 ప్రభాతవార్త:** ఉట్కూర్ మండల కేంద్రంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయం పంచాయతీ కార్యదర్శులు రెండవ రోజు నిరవధిక సమ్మెను చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వం మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని వన్ నోటిఫికేషన్ వన్ రెగ్యులరేషన్ సీఎం కెసిఆర్ చెప్పిన విధంగా అమలు చేయాలని లేని పక్షంలో సమ్మెను ఇలాగే కొనసాగిస్తామని ప్రతి గ్రామంలో కార్యదర్శి లేకుంటే పనులు నిలిచిపోతాయని తెలియజేశారు. వాళ్లకు మద్దతుగా చిన్నపొర్ల సర్పంచ్ మాలి పటేల్ రవిందర్‌రెడ్డి మద్దతు నిలిచి వాళ్ల కోరుకున్న న్యాయమైన హక్కు వాళ్ల ఉద్యోగాన్ని రెగ్యులర్ చేయాలని మేము కూడావాళ్ల వెంబడి ఉండి నిరవధిక దీక్షలో పాల్గొంటామని తెలియజేశారు.

## అంత్యక్రియలకు అభిమన్యురెడ్డి ఆర్థికసాయం



రూ.5వేల ఆర్థికసాయం అందజేస్తున్న అభిమన్యు యువసేన సభ్యులు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త :** రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామలో ఎరుకలి లక్ష్మయ్య అనారోగ్యంతో మరణించాడు. ఈవిషయాన్ని తెలిసిన వెంటనే బీఆర్ఎస్ యువనేత, ఎంటీపీసీ చించోడ్ అభిమన్యురెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి రూ.5వేల ఆర్థిక సాయం ప్రకటించారు.అభిమన్యు యువసేన సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించిశనివారం రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో యాదగిరి, శ్రీను, బాబా, కృష్ణయ్య,భగవంతు,రవి, శేఖర్, నాయకులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

## 13వ రోజుకు చేరిన ఐకేపీ, వీవోఏల దీక్ష



ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న ఐకేపీ వీవోఏలు

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, ఏప్రిల్ 29, ప్రభాతవార్త:** సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన ఐకేపీ,వీవోఏల దీక్షలు శనివారానికి 13వ రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య మాట్లాడుతూ వీవోఏలు జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెబుతూ ఆకులు తింటూ నిరసన తెలిపారు. మునుగోడు ఎన్నికల్లో ముఖ్య మంత్రి కేసీఆర్ రూ.10500 వేతనం ఇస్తామని చెప్పి నేటికి హామీ నెరవేరలేదన్నారు. ప్రభుత్వం చర్చలకు పిలిచి సానుకూలంగా డిమాండ్లు నెరవేర్చాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఐకేపీ వీవోఏలనకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సాధారణ భీమా రూ.10లక్షలు సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో బేగం సరిత,ఫాతిమా,మమత, స్వప్న కల్పన, అలివేల,మహేశ్వరి, జంగమ్మ,స్వరూప,రాణి తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల ఆశయ సాధనే తెలంగాణ జన సమితి లక్ష్యం



తెలంగాణ జన సమితి పార్టీ జెండావిష్కరణ చేస్తున్న ఎంఏ ఖాదర్ పాష

**వనపర్తి టౌన్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో జన సమితి 5వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. వనపర్తి నియోజకవర్గంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు ఎంఏ ఖాదర్ పాష జెండావిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అసువులు బాసిన అమరవీరుల లక్ష్యాలను సాధించడమే తెలంగాణ జన సమితి లక్ష్యమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యలపై అనునిత్యం పోరాడుతూ రాజకీయ లక్ష్య సాధన కోసం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షఫీ, టౌన్ అధ్యక్షుడు రఘునాయుడు, మండల అధ్యక్షుడుపిక్కిలి బాలయ్య, బీసీ సంఘంఅధ్యక్షుడు లింగస్వామి, యువజన విభాగం నాయకులు రామకృష్ణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన ఆర్టీసీ కార్మికులను సన్మానించిన మున్సిపల్ వైస్ చైర్మన్

**వనపర్తిటౌన్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త:** గత 30సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలు వివిధ విభాగాల్లో పనిచేసి శనివారం పదవి విరమణ పొందిన 3ఆర్టీసీ కార్మికులను బస్ డిపోలో జరిగినటువంటి కార్యక్రమంలో పాల్గొని వారిని మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ ఆర్టీసీ కార్మికులు ఐటీ కాంతారెడ్డి, కండెక్టర్ ఎమ్ఎమ్ రెడ్డి, హెల్పర్ శ్రీహరి లను డిపో మేనేజర్ పరమేశ్వరి తో కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మెన్ మాట్లాడుతూ తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ లాభాల్లో నడవడానికి కార్మికుల కృషి ఎంతో గొప్పదని తక్కువ జీతాలకు ఎక్కువ శ్రమ చేసి సంస్థను ముందుకు నడిపే విధంగా అనాధికాలంగా కార్మికుల శ్రమ వెలకట్టలేని కార్మికులను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐ చంద్రమౌళి, డీఆర్టీఓ గౌడ్, వెంకటేష్ గౌడ్, బీవీ రావు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



ఆర్టీసీ కార్మికులను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్

